
# అ(వ్య)ర్థపదార్థం



**డా. విజయబక్ష్**

"మా అమ్మను తీసుకురావాలనుకుంటున్నాను. అయితే ఆవిడకు ఓపికలేదు. నీకు ఏవిధమైన సాయమూ చేయలేదు. నీకు పాపం పనెక్కువవుతుందేమోనని భయంగా వుంది." శేఖర్ భార్యవైపు జాలిగా చూస్తూ అన్నాడు.

"నాకు మీ అమ్మగారు రావటం వల్ల పని ఎక్కువవుతుందనేది ఎట్లాఉన్నా, ఆవిడ పాపం ఈ అపార్టుమెంట్లల్లో, ఇరుకు బొరుకు చోట్లో ఎట్లా సర్దుకోగలరా అని ఆలోచిస్తున్నాను... పైగా ఆవిడకు దగ్గూ, ఆయాసమూ... మనకా చిన్నపిల్లలు... ఆవిడకీ, మనకీ కూడా ఇబ్బందే!" కర్ర విరక్కుండా, పాము చావకుండా తెలివిగా మాట్లాడింది సుగుణ.

"అయినా మనవైపు నుండి పట్టించుకోలేదనే నెపం మనమీద ఉండకూడదు కదా! రేపు ఒకసారి మా ఊరెళ్ళి ఆవిడ అభిప్రాయం ఏమిటో తెలుసుకొని వస్తాను."

"అదే మంచిది" అంది సుగుణ. అట్లా అన్నదేకాని లోలోపల భయం పట్టుకొంది. ఆ ముసలావిడతో మర్నాడు భర్త దిగుతాడేమోనని! ఆమె తనకు అత్తగారే! అయితే ఆమెకు సేవ చేస్తూ కూర్చోవాలని లేదే! పోనీ ఆమెకు అంతగా పడీపడీ సేవ చేస్తే వచ్చేలాభం ఏమైనా ఉందా? అంటే అదీలేదు. మెళ్ళో తెల్లపూసా, నల్లపూసా కూడా లేవు, కోడలింత కష్టపడి సేవలు చేసిందని ఇచ్చేందుకు! పైగా ఆమె తన పని తాను చేసుకోలేక మంచానపడితే... కుడిచేయి, ఎడమచేయి అని చూసుకోకుండా అన్నీ చేయాలి! ఛీ! ఆ ఊహే చిరాకుగా ఉంది! ఇట్లా ఆలోచించటం మొదలెట్టాక సుగుణకు కంటిమీద కునుకు లేదు. తనేదో మొహమాటపడిందికాని, భర్తతో చెప్పి ఉండవలసింది. ఆవిడ్ని తీసుకురావటం యిష్టంలేదని... తనని గురించి అతనేమనుకుంటాడోనని మొహమాటపడింది.

కథ

శేఖర్ ఉదయమే తమ ఊరికి ప్రయాణమైనాడు. అతను అటు వెళ్ళీ వెళ్ళగానే సుగుణ స్నానం కానిచ్చి దేవుడి ముందు కూర్చుంది. పరమ భక్తిప్రపత్తులతో పూజచేసింది. "స్వామి! మా అత్తగారికి ఇక్కడకు వచ్చే బుద్ధిమాత్రం పుట్టించకు. నీవు నా కోర్కె తీరిస్తే వరుసగా నాలుగు గురువారాలు ఉపవాసం ఉంటాను" అని మొక్కింది. అయినా మనసులో గుబులుగా, దిగులుగా ఉంది. ఆవిడ వస్తే ఆమె పడక ఎక్కడ ఏర్పాటుచేయాలి? ఉన్న రెండు బెడ్ రూమ్స్ తామొకటి, పిల్లలొకటి వాడుకొంటున్నారు. [illegible] మంచం వేస్తే... వచ్చే పోయేవారు, ఫ్రెండ్సు అంత అందంగా ఉండదు చూడటానికి. పోనీ వేరే ఇల్లొకటి తీసుకొంటే? ఈవిడవల్ల వచ్చే లాభం ఏంలేకపోయినా ఇదొక అదనపు ఖర్చా? ఇంతా చేస్తే, చూస్తే ఆవిడ దగ్గర ఇచ్చేందుకు ఏముంది? ఉన్న ఆ ఒక్క ఇల్లు ఎటూ తన భర్తకే వస్తుంది. తమకి ఆవిడ్ని తెచ్చుకొన్నందువల్ల అనవసరపు హైరాన తప్ప జరిగేదేముంది! ఇట్లా సాగేయి సుగుణ ఆలోచనలు.

** ** **

పొద్దుటే బస్సు ఎక్కిన శేఖర్ పదిగంటలవుతూండగా అమ్మ ముందున్నాడు. కొడుకుని చూచిన ఆమె కళ్ళల్లో మెరుపు... "ఏం బాబు! ముందుగా ఓ కార్డు ముక్క రాయకపోయినావా వస్తున్నానని... పోని కరణం బాబాయి ఇంటికి ఫోన్‌చేసి చెబితే వాళ్ళు కబురందించేవారు కదా! ఇంట్లో మజ్జిగ నీళ్ళున్నాయి... ముందు వస్తున్నావని తెలిస్తే గడ్డ పెరుగు తోడుబెడుదును కదా! నీ కిష్టంకదా..." అని అంటూనే కొడుకుకు గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. "అమ్మాయి, పిల్లలూ బాగున్నారా? పిల్లలు బాగా చదువుకొంటున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేస్తూనే గబగబ కాఫీ కలిపి కొడుక్కందించింది.

"బాబూ! ఒక్క నిముషం... ఇప్పుడే వస్తాను..." అంటూ పక్క ఇంట్లో నుంచి ఏదో చిన్నగిన్నెతో తెచ్చింది.

"ఏంటమ్మా! ఏమిటి తెచ్చేవ్?" శేఖర్ కొంచెం విసుక్కుంటున్నట్లు అడిగాడు.

"ఏంలేదు! నీకు ఆ మజ్జిగ నీళ్ళతో అన్నం ఎట్లా పెడతానురా!

రాఘవమ్మ పిన్ని నడిగి కుండలో తోడుబెట్టిన పెరుగు తెచ్చాను."

ఒక్కసారిగా శేఖర్ మనస్సు ఎందుకో కలవరపాటుకు గురయింది. పట్నం నుంచి ఏం తెచ్చేవని గాని, కోడలు ఏమి పంపిందనికాని అమ్మ పట్టించుకోదేం! ఎంతకీ తనకేది యిష్టమో అదే చేయాలని తాపత్రయపడుతుందేమిటి? అయినా తానేమిటి ఉత్తి చేతులూపుకొంటూ వచ్చాడేమి? అమ్మకు యిష్టమైంది ఒక్కటీ తేలేదు... ఎందుకో తల్లి ముఖంకేసి చూడాలంటే సిగ్గనిపించింది.

"బాబూ! నీ ఉద్యోగం అదీ కష్టం లేకుండానే సాగుతుందా? బండి మీద జాగర్తగా వెళ్ళి వస్తున్నావుగా" కత్తిపీట ముందేసుకొని వంకాయలు నాలుగుపక్షాలుగా తరుగుతూ అడిగింది సీతమ్మ.

"ఆ అంతా బాగానే వుంది. అసలు నేను యిప్పుడు వచ్చింది నిన్ను నాతో తీసుకువెళ్ళటానికని... అప్పుడేమో నాన్న పోయింతర్వాత సంవత్సరీకాలు అయ్యేవరకు రానన్నావు. ఇవుడన్నీ అయిపోయేయి కదా! రావటానికి నీకు అభ్యంతరం ఏమిటి?"

"ఎందుకురా నేను ఇప్పట్నుండే మీకు భారం! కాలూ, చేయి ఆడుతున్నాయికదా! ఇక్కడ ఏదో ఇంతవండుకొని పడుంటే తెల్లారిపోతుంది... ఆ పట్నంలో నా బరువు మీకెందుకు."

"అదికాదమ్మా! నిన్నిట్లా ఒంటరిగా వదిలేసేమని నలుగురూ అనుకోరా? నీవు మాతో ఉంటే బాగుంటుంది."

"నలుగురు సంగతీ వదిలేయ్! ఇదివరలో నాన్న ఉండగా వచ్చేంకదా! నెలరోజులుందామని వచ్చి, ఆ వాతావరణంలో పదిరోజులకంటే ఉండలేక తిరిగొచ్చేం కదా..." అంది సీతమ్మ. కాని నర్మగర్భంగా పలికిన ఆ 'వాతావరణం' అనే పదం గృహవాతావరణమా? పట్న వాతావరణమా? అని శేఖర్‌కి అనుమానం వచ్చింది. అపుడు తన తల్లిదండ్రులు వచ్చినందుకు పని ఎక్కువయిందని సుగుణ సణుక్కోవటం తనకు తెలుసు. ఆ తర్వాతనే తమ యింటికి వచ్చి వెళ్ళిన తర్వాతనే తండ్రి చాలా గంభీరంగా ఉన్నాడనీ తనకు తెలుసు.



తల్లి ఇంకా ఎటూ చెప్పకుండానే "అయితే ఇంతకీ నీవు అక్కడికి రానంటావ్" అన్నాడు. నిజానికి అది అతని మనసులో ఉన్న భావం. అది ఎంత తొందరగా బయటపెట్టాలా అని అతని మనస్సు తహతహలాడిపోతోంది. అందుకే... తాను వచ్చేడు. అడిగేడు అనే తన కర్తవ్యాన్ని తొందరగా ముగించుకొన్నాడు.

"అదే మంచిదనుకొంటాను." చాల క్లుప్తంగా సమాధానమిచ్చింది సీతమ్మ. ఆ క్లుప్తత వెనుక ఆమె మనసునిండా విస్తారమైన అనుభవాలున్నాయి. అవి కొడుకుతో చెప్పాలని ఆ తల్లికి లేదు. ఎన్నోసార్లు కోడలు వాళ్ళమీద వీళ్ళమీద పెట్టి "ఎంత ముసలివారయినా కామాక్షమ్మగారు ఈశ్వరావుగారు తమ పల్లెటూర్ని సొంత యింటిని వదిలిపెట్టి పిల్లల దగ్గరకు రాలేదు. మా చిన్నమ్మమ్మ కూడా అంతే! ఒకతే ఆ యింట్లో తన పాట్లేవో పడుతుంది. ముగ్గురు కొడుకులు, కోడళ్ళున్నా ఎవరింటికీ వెళ్ళదు..." ఇవన్నీ రాబోయే కాలంలో తానెట్లా ఉండాలో ఇచ్చే తరఫీదులని సీతమ్మకు తెలియకపోలేదు. ఇపుడవన్నీ తాను కొడుక్కు చెప్పి అతని నుండి అదనంగా పొందగలిగే సానుభూతి ఏమీలేదు. అతనికి తన రాక కొన్ని ఇబ్బందులు కలిగించవచ్చు. భార్యతో అనవసరపు మనస్పర్థలు రావచ్చు. తాను ఒంటరిగా ఉన్నా వచ్చే నష్టమంటూ ఏమీలేదు. భర్త పోవటమే పెద్ద కష్టం. అయితే అపుడపుడూ అనిపించేది. ఒక్క కొడుకు కాకుండా మరో ఒకరో ఇద్దరో ఉంటేనని? అయినా వారు మాత్రం ఇట్లాగే ఉండరని నమ్మకం ఏమిటి? ఏమైనా కోడలు తనకు ముందుగానే మార్గనిర్దేశం చేసింది.

ఎంత వద్దనుకొన్నా శేఖర్ తననుతాను సమాధానపరచుకోలేకపోతున్నాడు. అమ్మ ఆదరణలో, మాటల్లో, ఆచరణలో పూర్వమెట్లా ఉందో అట్లాగే ఉంది. తనకిష్టమైన గుత్తివంకాయ- మామిడికాయపప్పు- ఊరమిరపకాయలు- గోంగూరపచ్చడి- గట్టి పెరుగు అన్నీ తనతో మాట్లాడుతూనే ఎంత వేగంగా చేసింది! అసలామెకింత ఓపిక ఎక్కడిది! ఎక్కడిదేమిటి అదేనేమో తల్లి ప్రేమంటే! అయుండొచ్చు.

సాయంకాలం బయలుదేరుతూ అన్నాడు శేఖర్ "ఏమోనమ్మా! నీవిట్లా ఒంటరిగా ఉండటం నాకు నచ్చలేదు. అయినా నీ యిష్టాన్ని కాదనలేకపోతున్నాను..." అన్నాడు.

జవాబుగా సీతమ్మ నవ్వింది. "ఇవిగో ఈ సంచిలో పచ్చివేరుశెనక్కాయలు ఉన్నాయి. సుగుణకు ఉడకబెట్టిన కాయలు బాగా యిష్టమని ఇస్తున్నాను. కాదనక పట్టుకెళ్ళు. రేపు బాగా ఉప్పువేసి కుక్కర్‌లో పెట్టుకోమను. బాగుంటాయి" అంటూ కొడుకు చేతికి సంచి యిచ్చింది. శేఖర్ అందుకొంటూ తల్లివైపు చూచేడు. చిక్కిపోయింది. కాని ముఖంలో ఏదో ఊహకందని తేజం... చిరునవ్వు స్వచ్ఛంగా వెన్నెల్లా ఉంది. ఏదో ఆశించి, నటించే నవ్వుకాదది.

"వస్తానమ్మా" అంటూ వెళ్తున్న కొడుకునను సరించి వీధి చివరదాకా వచ్చింది సీతమ్మ. "పిల్లల్ని ఊరకే విసుక్కోటం, కొట్టటం చేయకండి. పసివెధవలు కొడితే కొడతారా; తిడితే తిడతారా!" అంటూ ఏదేదో మాట్లాడుతూనే ఉంది. నెకొడుకు కనిపించినంత దూరం కనురెప్పవేయకుండా చూస్తూనే ఉంది. నెమ్మదిగా కాళ్ళీడ్చుకొంటూ వచ్చింది. ఇంట్లోకి అడుగుపెడుతూనే వెక్కివెక్కి ఏడ్చింది. ఎంత ఏడ్చినా ఓదార్చే దిక్కులేని తాను ఎంతసేపు ఏడ్చి ఏం ప్రయోజనమని తనను తానే సంబాళించుకొంది సీతమ్మ. తనను ఇరుగుపొరుగు అంతా అడుగుతూనే ఉన్నారు. "మీ అబ్బాయి కోడలు ఎంచేత రమ్మనటం లేదు" అని. తానే అందరితో ఉన్న ఊరు దేంతో సమానంకాదని; అందుకే తాను వెళ్ళడంలేదని తప్పు తనమీదనే వేసుకొంది. నిజానికి తనకు మనవలతో గడపాలని, వాళ్ళు చెప్పే కథలు, కబుర్లు వినాలనీ ఎంతో ఆశగా ఉంది. కానీ తన ఉనికి నచ్చని కోడలు వద్దకు వెళ్ళి తానెట్లా ఉండగలదు?

**తాను ఒంటరిగా ఉన్నా వచ్చే నష్టమంటూ ఏమీలేదు. భర్త పోవటమే పెద్ద కష్టం. అయితే అపుడపుడూ అనిపించేది. ఒక్క కొడుకు కాకుండా మరో ఒకరో ఇద్దరో ఉంటేనని? అయినా వారు మాత్రం ఇట్లాగే ఉండరని నమ్మకం ఏమిటి? ఏమైనా కోడలు తనకు ముందుగానే మార్గనిర్దేశం చేసింది.**

తనకు పదహారవ ఏటనే రామారావుతో పెళ్ళయింది. తాను అత్తింటికి కాపురానికి వచ్చేనాటికి అత్తమామ, ఇద్దరు ఆడపడుచులు, మరిది ఇంతమంది ఉండేవారింట్లో. ఎప్పుడూ ఇల్లు కళకళలాడుతూ వుండేది. చిన్నచిన్న సమస్యలూ పోట్లాటలూ వస్తూండేవి. చిన్నవాళ్ళని పెద్దవాళ్ళు క్షమిస్తూ ఉండేవారు. చిన్నవాళ్ళు పెద్దవాళ్ళని గౌరవిస్తూ ఉండేవారు. పిల్లలకు వచ్చే రోగం రొష్టులు, చాకిరీ అంతా పెద్దావిడ అత్తమ్మ, ఆవిడ అత్తమ్మ చూసుకొనేవాళ్ళు. మధ్యతరగతి కుటుంబాల్లో వున్నట్లే తమకు చాలీచాలని ఆదాయంతో జీవితం సాఫీగా కాకున్నా బాగానే గడిచింది. ఆడపడుచుల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, పుణ్యాలు అన్నింటికీ పెద్దకోడలుగా తనే సాక్షి. మరిది మాత్రం పెళ్ళి కాకుండానే యాక్సిడెంట్‌లో చచ్చిపోయాడు. అత్తామామలు బెంగపడి మంచంపట్టారు.

ఇద్దరికి తానెంతో సేవ చేసింది. ధైర్యం చెప్పింది. ముందు మామేపోయాడు. అత్త ఇంకా ఇంకా దిగులుతో మంచం మీద నుండి లేవలేని స్థితికి వచ్చింది. ఏరోజు తాను విసుక్కోలేదు. అంత సేవ చేసింది. తన అత్త మాత్రం కళ్ళనీళ్ళు పెట్టుకునేది. "పిచ్చితల్లీ! ఎంత సేవ చేస్తున్నావో అసహ్యించుకోకుండా... ఆ దేవుడు నిన్ను సల్లగా చూస్తాడు. బంగారంలాటి కొడుకు. మేలిమిలాటి కోడలు వస్తుంది. నీకంతా బాగా జరుగుతుంది" అని దీవించింది. మరిప్పుడు తనకేమిటిలా జరిగింది! దిక్కులేని అనాథలాగా తానెందుకు ఇట్లా ఒంటరిగా పడుంది! ఏమిటో ఎందుకో ఆ పరమాత్మకే తెలియాలి.



** ** **

శేఖర్ ఇంట్లోకి అడుగుపెడుతూనే "సుగుణా ఎవరొచ్చారో చూడు" అన్నాడు. ఒక్కసారి సుగుణ గుండెలు గుభిల్లుమన్నాయి. అయినా ముఖమంతా నవ్వు పులుముకొని "రండి... రండి" అంటూ "అత్తయ్య రాలేదా?" అని అడిగింది. ఆ అడగటంలో ఉన్న ఆత్రం స్పష్టంగా అర్థం అవుతోంది వినేవారికి.

"వచ్చిందే..." అంటూ శేఖర్ కొంటె నవ్వు నవ్వాడు.

"హమ్మయ్య" పైకి రాబోయిన శబ్దాన్ని గట్టిగా నొక్కిపట్టింది.

"అదేం? ఆమెను తీసుకురాలేదా? మీరు భలేవారే" వద్దంటున్నా సంతోషం గుండెలను తన్ని పైకొస్తోంది.

"ఎంత బతిమాలినా రానంది. మరేం చేయను" శేఖర్ భార్య మెప్పుకోసం వెయిట్ చేసాడు.

"ఎందుకని రానంది! మనమేం బాగా చూడటంలేదా? లేకుంటే పని ఎక్కువ చెబుతున్నామా?" సుగుణ అనుమానం.

"ఏమో అదే అర్థం కావటంలేదు."

"అర్థంకావటంలేదా? అర్థం కాకుంటేనే మంచిదిలెండి. ఎందుకంటే అదొక వ్యర్థపదార్థం కనుక" అని మనసులోనే అనుకొంది సుగుణ.

మరో నెలరోజులకొక అనుకోని విచిత్రం జరిగింది. సుగుణ తల్లి శేషమ్మ విపరీతంగా జబ్బుపడింది. ఉన్న ఒక్క కొడుకు ఉద్యోగరీత్యా బొంబాయిలో వున్నాడు. ఆడపిల్ల సుగుణ. దగ్గరలోనే ఉంది కాబట్టి తల్లికి ఆసరాగా ఉండేందుకు పుట్టింటికి వెళ్ళింది. సుగుణ వెళ్ళిందగ్గరి నుండి శేఖర్‌కి పిల్లలకు భోజనాలు, అవసరాలు తీరటం కష్టమయింది. అందుకనే శేఖర్ తన అత్తగారిని తీసుకొని వెంటనే వచ్చేయమని సుగుణకు ఫోనుచేశాడు. మర్నాడే సుగుణ తల్లితో దిగింది. అమ్మమ్మ రాక పిల్లలకి ఎక్కడలేని సంతోషాన్ని కలిగించింది. ఆవిడని కాలు కింద పెట్టనీయకుండా సుగుణ సేవలు చేసింది. 'విశ్రాంతి' తీసుకోవాలంటూ ఒక్క పని చెయ్యనివ్వలేదు. పిల్లలు కూడా నెమ్మదిగా అమ్మమ్మకు దగ్గరయ్యారు. అప్పుడప్పుడు పిల్లల్ని తల్లికి అప్పచెప్పి సుగుణ షాపింగులు అని, భర్తతో కలిసి సినిమాలకని వెళ్ళేది. తల్లిరాక చాలా హాయిగా ఉంది. అందుకే ఆమె తల్లి ఆరోగ్యం బాగయి వెళ్తానన్నా వెళ్ళనివ్వలేదు.

**శేఖర్‌కి కూడా అత్తగారి రాక భారం అనిపించలేదు. ఆవిడ భర్త తాలూకు పెన్షన్ వస్తుంది నెలనెలా. ఆమె ఆ డబ్బంతా సుగుణకే ఇచ్చేది. కొడుకు పంపే డబ్బు కూడా సుగుణకే ఇచ్చేది. ఎంతలేదన్నా నెలకు ఓ అయిదువేలు ముట్టేది. మహా ఆవిడకి ఓ రెండువేలు ఖర్చయినా బోలెడంత మిగులుతోంది. "అమ్మను ఇక్కడే ఉంచుకుందామండి" ఆరోజు రాత్రి సుగుణ చాలా గోముగా అడిగింది. శేఖర్ గడ్డం పట్టుకొని బుజ్జగిస్తూ.**

శేఖర్‌కి కూడా అత్తగారి రాక భారం అనిపించలేదు. ఆవిడ భర్త తాలూకు పెన్షన్ వస్తుంది నెలనెలా. ఆమె ఆ డబ్బంతా సుగుణకే ఇచ్చేది. కొడుకు పంపే డబ్బు కూడా సుగుణకే ఇచ్చేది. ఎంతలేదన్నా నెలకు ఓ అయిదువేలు ముట్టేది. మహా ఆవిడకి ఓ రెండువేలు ఖర్చయినా బోలెడంత మిగులుతోంది.

"అమ్మను ఇక్కడే ఉంచుకుందామండి" ఆరోజు రాత్రి సుగుణ చాలా గోముగా అడిగింది. శేఖర్ గడ్డం పట్టుకొని బుజ్జగిస్తూ.

"నీ యిష్టం. అయినా ఆవిడ ఉండటానికి యిష్టపడ్డారా?"

"ఆమెకయితే లేదు. కాని మనవలు వెళ్తానని అనగానే ఏడుపు లంకించుకొన్నారు. అక్కడ ఒక్కదానివే ఏముంటావు. ఇక్కడే ఉండిపో అని నేనూ అన్నాను. అయినా అల్లుడిల్లు కదా అని మొహమాటపడుతోంది. ఆమె మనవద్ద ఉచితంగా ఏం తింటంలేదుకదా! బోలెడంత డబ్బు యిస్తున్నది. అంతేకాదు మా అమ్మ ఒంటిమీద ఎంత లేదన్నా ముప్ఫైకాసుల బంగారం వుంది. రేపు ఆవిడకి కాలుచేయి ఆడకుంటే అన్నీ నేనే చేయాలా! ఆవిడ అదంతా నాకు కాక మరెవరికిస్తుంది చెప్పండి; దీంతో మనకు పుణ్యమూ, పురుషార్థమూ కూడా దక్కుతాయి."

శేఖర్ భార్య తెలివితేటలకీ, ముందు చూపుకు ఆశ్చర్యపడ్డాడు.

వీలయినప్పుడల్లా సుగుణ తన తల్లి తమతో వుండటంవల్ల వచ్చే లాభాలను ఏకరువు పెడుతూ వుండేది. తల్లి ఉండటంవల్ల తమ మధ్య ఓ పెద్దతల ఉందన్న భావం, తమకు ఎక్కడికెళ్ళాలన్నా అడ్డులేదని, తమ ఇంటిని, పిల్లల్ని చూడటమేకాక, ఆర్థికలాభాలు అన్ని చెప్పీచెప్పీ, చివరకు శేఖర్‌కి కూడా అత్తగారు లేకుంటే గడవదు అనిపించేలా చేసింది. చూస్తుండగానే నాలుగేళ్ళు గడిచిపోయాయి. నెలకోసారి శేఖర్ సొంత కారులో పల్లెటూరు వెళ్ళి తల్లిని చూసి వస్తుండేవాడు. పైగా ఆ కారు అత్తగారు కొనిచ్చిందని గొప్పగా చెప్పాడు.

అత్తగారు తమ యింట్లో వచ్చి ఉండటానికి కారణం సుగుణ ఉద్యోగం చెయ్యాలనుకొంటోందని, పిల్లలను చూడటానికని నమ్మకమైన మనిషి దొరికేవరకు వుంటుందని చెప్పాడు. అయితే ఆ నమ్మకమైన మనిషి ఈ నాలుగేళ్ళల్లోను దొరకలేదా? కాని సీతమ్మ అంత పిచ్చిదికాదు! కొడుకు కోడలు దృష్టిలో వీసమెత్తు లాభంలేని తానొక 'వ్యర్థ' పదార్థాన్ననీ- బంగారు పిచుకలాటి శేషమ్మ 'అర్థ' పదార్థమనీనూ!